



# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)







Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 53 | బుధవారం 25 మార్చి 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695


## బడ్జెట్ సమావేశాల వేళ హైడ్రామా..

ఢిల్లీ అసెంబ్లీకి బాంబు బెదిరింపు




## త్వరలో 'సాదాబైనామా' దరఖాస్తుల పరిష్కారం




## జొమాటో బాటలోనే స్విగ్గీ.. ప్లాట్ ఫారమ్ ఫీజు పెంపు




## క్షేత్ర స్థాయిలో గ్యాస్ కొరత తీవ్రంగా ఉంది..మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు




## విద్యార్థినులకు ఉచిత సైకిళ్లు

మహిళలకు నెలకు రూ.2,500 భరోసా




## జేడీయూ జాతీయ అధ్యక్షుడిగా నితీష్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక




## హైదరాబాద్ నగరానికి 915 ఎలక్ట్రిక్ బస్సులు.. ఇక వాతావరణ కాలుష్యానికి చెక్!




# 35 ఏళ్ల అజ్ఞాతవాసానికి తెర

## మావోయిస్టు అగ్రనేత పాపారావు సరెండర్!

**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బస్తర్‌లో పెను సంచలనం చోటుచేసుకోబోతోంది. సీపీఐ మావోయిస్టు పార్టీ లో అత్యంత కీలక నేత, డివిజనల్ కమిటీ కమాండర్, మూడు దశాబ్దాలకు పైగా అడవుల్లో ఉంటూ అనేక దాడులకు సూత్రధారిగా వ్యవహరించిన పాపారావు అలియాస్ మంగు దాదా అలియాస్ చంద్రన్న అలియాస్ సునాం చంద్రన్న ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోబోతున్నట్లుగా తెలుస్తోంది. ఆయనతో పాటు లొంగిపోబోయే ప్రముఖుల్లో ఏసీఎం కొర్రం మనీష, ఏసీఎం పర్చాపి మంగేష్, సీవైపీసీఎం కమాండర్ కేశా సోఢి, పరాతాపూర్ ఏసీఎం చందర్ కట్లం, పరాతాపూర్ ఏసీఎం రూపి, దక్షిణ బస్తర్ డివిజన్ మిలిటరీ కమాండర్ ఇన్ చీఫ్ విజ్జా హేమలా కూడా ఉన్నారు. వీరి సరెండర్ ప్రక్రియ జగదల్‌పూర్‌లో జరిగే అవకాశం ఉంది. సుమారు 12 నుంచి 17 మందికి పైగా పార్టీ సభ్యులు కూడా లొంగిపోతున్నట్లుగా సమాచారం అందుతోంది. అయితే, దక్షిణ, పశ్చిమ బస్తర్ రీజియన్లను మిగిలి ఉన్న చివరి డీకేఎస్‌జెడ్‌సీ కీలక కమాండర్‌గా పేరున్న పాపారావు లొంగిపోవడం మావోయిస్టు




నెట్‌వర్క్‌కు తీరని లోటుగా భద్రతా దళాలు భావిస్తున్నాయి.

వరుస దాడులకు వ్యూహకర్త..రెండు దశాబ్దాలుగా ఇంద్రావతి-అబుజ్‌మడ్ అటవీ ప్రాంతం కేంద్రంగా పాపారావు తన కార్యకలాపాలను సాగించారు. గెరిల్లా యుద్ధ తంత్రంలో ఆరితేరిన వ్యక్తుల్లో మడావి హిడ్మా, బార్సే దేవా తర్వాత పాపారావు కూడా ఒకరు. భద్రతా బలగాలపై జరిగిన భారీ ఎన్‌కౌంటర్లు, మెరుపు దాడుల్లో ఈయన అత్యంత కీలక పాత్ర పోషించారు.

## రాజస్థాన్ రాష్ట్రంలో ఘోరం

### ప్రియుడి మోజులో భర్తను చంపిన భార్య




**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** దేశ వ్యాప్తంగా వివాహేతర సంబంధాలు అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంటాన్నాయి. తాజాగా తన ప్రేమకు అడ్డుగా ఉన్నాడని భావించిన ఓ భార్య, ప్రియుడితో కలిసి భర్తను అత్యంత క్రూరంగా గొంతు నులిమి హతమార్చిన ఉదంతం రాజస్థాన్ లోని బలోత్రా జిల్లాలో వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు మాల్వా గోయ్లాన్ గ్రామానికి చెందిన మహేంద్ర మేఘవాల్ (23)తో నాలుగేళ్ల క్రితం అను దేవి (23)తో వివాహమైంది.అయితే, వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి.

## మత మార్పిడులపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు




**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** భారత సుప్రీం కోర్టు మత మార్పిడిలపై సంచలన తీర్పును ప్రకటించింది. ఎస్సీ కులానికి చెందిన వారు మతం మారితే ఎస్సీ హోదా రద్దు అవుతుందని ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోకి కాకుండా ఇతర ఏ మతంలోకి మారిన వారి ఎస్సీ హోదా రద్దు అవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలను చేసింది. గతంలో ఏపీ హైకోర్టు జరిగిన విచారణలో..

## ట్రంప్ 'విరామ' వ్యూహం.. ఇరాన్ 'సవాల్' గర్జన

### ఆగని దాడులు ముగియని పోరు!




**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఐదు రోజులు యుద్ధం నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. కానీ అమెరికా-ఇరాన్ మధ్య సాగుతున్న భీకర పోరు 25వ రోజుకు చేరుకుంది. ఒకవైపు శాంతి చర్చల దిశగా అడుగులు పడుతున్నాయని ప్రపంచం భావిస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లపై దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ, మిలిటరీ స్థావరాలే లక్ష్యంగా అమెరికా తన ప్రతాపాన్ని చూపిస్తోంది.

శాంతి ముసుగులో వ్యూహాత్మక దాడులు?: ట్రంప్ ప్రకటించిన 'ఐదు రోజుల విరామం' కేవలం విద్యుత్ ప్లాంట్లకే పరిమితం కావడంతో, అమెరికా సైన్యం తన దృష్టిని ఇరాన్ సైనిక స్థావరాలపై పెట్టింది. ఆయుధ గిడ్డంగులు, ట్రక్కులు, కీలక మిలిటరీ భవనాలపై అమెరికా బాంబుల వర్షం కురిపిస్తోంది. దీనికి సంబంధించిన దృశ్యాలను US సెంట్రల్ కమాండ్ తాజాగా విడుదల చేస్తూ.. దాడులు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది. ఇది ఒక రకంగా ఇరాన్ ఆర్థిక రంగాన్ని కాపాడే నెపంతో, ఆ దేశ రక్షణ వ్యవస్థను పూర్తిగా దెబ్బతీసే వ్యూహమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మారనున్న దేశ రాజకీయ ముఖచిత్రం

- లోక్‌సభ సీట్లు పెంపు
- అసెంబ్లీ స్థానాల విస్తరణ
- 50% వరకు సీట్ల పెంపు
- 543 నుంచి 816 లోక్‌సభ సీట్లు
- రాష్ట్రాల్లో కొత్త లెక్కలు
- తెలుగు రాష్ట్రాలకు అదనపు సీట్లు
- 2029 ఎన్నికల లక్ష్యం
- పార్లమెంటులో బిల్లు అవకాశం
- దక్షిణాది రాష్ట్రాల ఆందోళన




**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. లోక్‌సభ సీట్లతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను భారీగా పెంచాలని యోచిస్తోంది. సోమవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశంలో కేంద్రం ఈ ప్రతిపాదనలను వెల్లడించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌ల నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేయడంలో భాగంగా, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుత ప్రతిపాదన ప్రకారం, దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్యను దాదాపు 50 శాతం పెంచాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలు 543 నుంచి 816కి చేరనున్నాయి. అదేవిధంగా దేశ వ్యాప్తంగా ఉన్న అసెంబ్లీ స్థానాలు 4,123 నుంచి 6,185కి పెరగనున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో కొత్త లెక్కలు..

నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య గణనీయంగా పెరగనున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 అసెంబ్లీ స్థానాలు 179కి పెరిగే అవకాశం ఉంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ స్థానాలు 263కి చేరనున్నాయి. సాధారణంగా నియోజకవర్గాల పునర్విభజన కొత్త జనాభా గణన తర్వాత జరగాల్సి ఉంది. అయితే, 2021 జనాభా గణన ఆలస్యం కావడంతో, 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకుని ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్రం యోచిస్తోంది. దీనివల్ల 2029 సార్వత్రిక ఎన్నికల నాటికే పెరిగిన సీట్లతో పాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కూడా అమలు చేయడం సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

మిగతాది 2 లో..

## ఎస్‌బీఐ కస్టమర్లకు గుడ్‌న్యూస్

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంపు!




**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ బ్యాంకులో అకౌంట్ కలిగి ఉన్న కస్టమర్లకు తీపి కబురు అందించింది. బల్క్ టర్మ్ డిపాజిట్లపై (రూ. 3 కోట్ల కంటే ఎక్కువ) వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. తాజాగా సవరించిన ధరల ప్రకారం, ఏడాది నుంచి రెండేళ్ల లోపు కాలపరిమితి గల డిపాజిట్లపై వడ్డీ రేటును 6.25 శాతం నుంచి 6.50 శాతానికి పెంచింది.

## విజయవాడ నగరంలో కలకలం.. ఉగ్రవాద సానుభూతిపరుల అరెస్ట్




**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** విజయవాడ నగరంలోని వించిపేట లో కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు సోమవారం అర్ధరాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. సోషల్ మీడియా వేదికగా ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా ప్రచారం చేస్తున్నారనే పక్కా సమాచారంతో ఈ సోదాలు చేపట్టారు.

కెరటం (సామాన్యుడి ఆయుధం) న్యూస్



# రాజస్థాన్ రాష్ట్రంలో ఘోరం.. ప్రియుడి మోజులో భర్తను చంపిన భార్య

మొదటి పేజీ తరువాయి

అయితే, భార్య అనుదేవికి వివాహానికి ముందే ప్రియుడు అమ్రారామ్ ఉన్నాడు. అతడు ఓ ప్రభుత్వ పాఠశాలలో గ్రేడ్-3 ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు.

కాగా, మార్చి 20న మహేంద్ర మేఘవాల్, అను దేవి కి మధ్య గొడవ జరిగింది. కోపంతో ఉన్న అనుదేవి అర్ధరాత్రి తన ప్రియుడు అమ్రారామ్‌ను ఇంటికి పిలిపించింది. మహేంద్ర గాఢనిద్రలో ఉన్న సమయంలో ఇద్దరూ కలిసి అతని గొంతు నులిమి సైలెంట్ చంపేశారు. అనంతరం అమ్రారామ్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఆ మరుసటి రోజు ఉదయం మహేంద్ర ఎంతకీ బయటకు రాకపోవడంతో బంధువులకు అనుమానం వచ్చింది. గదిలోకి వెళ్లి చూడగా మహేంద్ర విగతజీవిగా పడి ఉన్నాడు. అనుదేవి మాత్రం అతను ఇంకా నిద్రపోతున్నాడని అబద్ధం చెప్పి నమ్మించే ప్రయత్నం చేసింది. కానీ, మహేంద్ర మెడపై ఉన్న గాయాలను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో అను దేవి పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం బలపడింది. దీంతో వారు తమదైన స్టైల్లో విచారించగా, తన ప్రియుడు అమ్రారామ్‌తో కలిసి భర్తను హతమార్చినట్లుగా ఆమె అంగీకరించింది. ఈ మేరకు పోలీసులు నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# క్షేత్ర స్థాయిలో గ్యాస్ కొరత తీవ్రంగా ఉంది.. మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల కొరతను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ మంగళవారం అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద భారీ నిరసన చేపట్టింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంతర్జాతీయంగా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రజలు గ్యాస్ సిలిండర్ల కోసం అల్లాడిపోతున్నారని ఫైర్ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం కొరత లేదని నమ్మబలుకుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సామాన్యులకు సిలిండర్లు దొరకడం లేదని ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వం ఎల్‌పీజీ కొరత లేదంటుందని.. రాష్ట్ర ప్రభుత్వం పెట్రోలియం శాఖ తమ చేతుల్లో లేదని తప్పించుకుంటుందని కేటీఆర్ అన్నారు. వీరిద్దరి తీరు చూస్తుంటే ఆంబోతుల కొట్లాటలో లేగ దూడలు బలైనట్లుగా సామాన్య ప్రజల పరిస్థితి తయారైందని విమర్శించారు. భవిష్యత్తులో గ్యాస్ సిలిండర్ పరిమాణాన్ని 14 కిలోల నుంచి 10 కిలోలకు తగ్గించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఇది ప్రజలను మరింత ఇబ్బంది పెట్టడమేనని అన్నారు. గ్యాస్ సరఫరాపై ఉన్న అయోమయాన్ని తొలగించేలా ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని గ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ నగరానికి 915 ఎలక్ట్రిక్ బస్సులు ఇక వాతావరణ కాలుష్యానికి చెక్!

**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** భాగ్యనగర వాసులకు మెరుగైన, పర్యావరణహిత రవాణా సౌకర్యాలను అందించే దిశగా మరో కీలక ముందడుగు పడింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పీఎం ఈ-డ్రైవ్ (ఎలక్ట్రిక్ డ్రైవ్ రివల్యూషన్ ఇన్ ఇన్నోవేటివ్ వెహికల్ ఎన్హాన్స్మెంట్) పథకం కింద హైదరాబాద్‌లో 915 ఎలక్ట్రిక్ బస్సుల సరఫరా, నిర్వహణ కోసం ఈకేఏ మొబిలిటీ-గ్రీన్ సెల్ మొబిలిటీ కన్సార్టియంకు లెటర్ ఆఫ్ అవార్డు లభించింది. కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్ నేతృత్వంలో ఈ ప్రాజెక్టు అమలు కానుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 915 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో నగరంలోని ఇరుకైన రోడ్లు, కాలనీల అవసరాల కోసం తొమ్మిది మీటర్ల పొడవున్న 100 మినీ బస్సులు, ప్రధాన మార్గాల్లో ప్రయాణికుల రద్దీని తట్టుకోవడానికి 12 మీటర్ల పొడవున్న 815 స్టాండర్డ్ ఫ్లోర్ నాన్-ఏసీ బస్సులు నగర వాసులకు సేవలు అందించనున్నాయి.

కాలుష్య రహిత ప్రయాణం..: ఈ బస్సులు పూర్తిగా ఎలక్ట్రిక్ కావడంతో కాలుష్య ఉద్గారాలు ఉండవు. ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేలా వీటిని అత్యాధునిక సాంకేతికతతో రూపొందించారు. ఇప్పటికే రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ఈ-బస్సుల సరఫరాకు ఆర్డర్లు పొందిన ఈకేఏ మొబిలిటీ... ఇప్పుడు హైదరాబాద్‌లోనూ తన సేవలను విస్తరించడం విశేషం. పీఎం ఈ-డ్రైవ్ లక్ష్యాలకు అనుగుణంగా హైదరాబాద్‌ను స్మార్ట్, క్లీన్ సిటీగా మార్చడంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని ఈకేఏ మొబిలిటీ బిజినెస్ హెడ్ రోహిత్ శ్రీవాస్తవ తెలిపారు.

# మారనున్న దేశ రాజకీయ ముఖచిత్రం

మొదటి పేజీ తరువాయి

పార్లమెంటులో బిల్లు.. రాజకీయ సెగ: ఈ నియోజకవర్గాల పెంపునకు సంబంధించి ప్రస్తుత పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే కేంద్రం బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 82, 170లకు సవరణలు చేయాల్సి ఉంటుంది. అయితే, జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే జనాభా నియంత్రణను పాటిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఎన్డిఏ భాగస్వామ్య పక్షాలతో పాటు ప్రతిపక్షాలను కూడా ఒప్పించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందితే, భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది అతిపెద్ద సంస్కరణగా నిలిచిపోనుంది.

# కొత్త పార్లమెంటులో వైసీపీకి నెంబర్ 11 రూమ్.. మార్చాలని ఎంపీల డిమాండ్



**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** కొత్త పార్లమెంట్ భవనంలోని మొదటి అంతస్తులో వైఎస్సార్‌సీపీ కార్యాలయం కోసం స్పీకర్ కార్యాలయం తొలుత 11వ నెంబర్ రూమ్‌ను కేటాయించింది. అయితే.. ఈ నెంబర్ పట్ల ఆ పార్టీ ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేటాయింపు జరిగిన వెంటనే స్పందించిన ఎంపీలు, లోక్ సభ స్పీకర్ ను కలిసి ఆ గదిని మార్చాల్సిందిగా కోరారు. స్పీకర్‌తో భేటీ అయి తమకు 11వ నెంబర్ గది ఎందుకు వద్దో సాంకేతిక లేదా సెంటిమెంట్ పరమైన కారణాలను వివరించినట్లు సమాచారం. ఎంపీల విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన స్పీకర్ కార్యాలయం.. వెంటనే స్పందించి 11వ నెంబర్ గదికి బదులుగా 12వ నెంబర్ రూమ్‌ను వైఎస్సార్‌సీపీకి కేటాయించింది. దీంతో ఆ పార్టీ ఎంపీలు ఊపిరి పీల్చుకున్నారు.

టీడీపీకి 9వ నెంబర్ గది కేటాయింపు

ఇదే క్రమంలో.. తెలుగుదేశం పార్టీకి కూడా కొత్త పార్లమెంట్ భవనంలోని మొదటి అంతస్తులోనే 9వ నెంబర్ రూమ్‌ను స్పీకర్ కార్యాలయం ఇప్పటికే కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాన పార్టీల కార్యాలయాలు పక్కపక్కనే ఉండటం గమనార్హం. కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి రావడంతో, స్పీకర్ కార్యాలయం అన్ని రాజకీయ పార్టీలకు కార్యాలయాలను కేటాయించే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పాత పార్లమెంట్ భవనంలోని పార్టీ కార్యాలయాలను క్రమంగా ఖాళీ చేయిస్తున్నారు. అన్ని పార్టీలకు సదుపాయాలు కల్పించేలా ఎంపీల సంఖ్యకు అనుగుణంగా గదుల కేటాయింపు జరుగుతోంది.

# బడ్జెట్ సమావేశాల వేళ హైడ్రామా.. ఢిల్లీ అసెంబ్లీకి బాంబు బెదిరింపు

**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** ఢిల్లీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కావడానికి కొద్ది గంటల ముందు బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. అసెంబ్లీ స్పీకర్ విజయేందర్ గుప్తాకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపు ఈ-మెయిల్ రావడంతో భద్రతా దళాలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. అయితే, ఆ ఈ-మెయిల్‌లో అసెంబ్లీ ప్రాంగణాన్ని పేల్చివేస్తామని సందేశం ఉంది. దీంతో భద్రతా కారణాల దృష్ట్యా అసెంబ్లీ పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు.

డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు..

మరోవైపు ఢిల్లీ ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న తరుణంలో ఈ బెదిరింపు రావడం హాట్ టాపిక్‌గా మారింది. సభలో కీలక చర్చలు జరగాల్సి ఉన్న సమయంలో ఈ ఘటన జరగడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ-మెయిల్ అందిన వెంటనే ఢిల్లీ పోలీసులు.. డాగ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ అసెంబ్లీ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే, ఇప్పటి వరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని, ఇది ఆకతాయినల పని కావచ్చని భావిస్తున్నారు.

ఈ-మెయిల్‌పై పోలీసుల ఆరా..

అసలు ఈ-మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది.. దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్పీకర్ విజయేందర్ గుప్తా ఈ ఘటనపై స్పందిస్తూ.. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదని, ప్రజాస్వామ్య ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తున్నారు.

# జొమాటో బాటలోనే స్విగ్గీ.. ప్లాట్ ఫారమ్ ఫీజు పెంపు

**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేసే కస్టమర్లకు షాక్ ఇస్తూ ప్రముఖ డెలివరీ సంస్థలు జొమాటో, స్విగ్గీ తమ ప్లాట్‌ఫారమ్ ఫీజును పెంచాయి. జొమాటో తన చార్జీలను సవరించిన కొద్ది రోజుల్లోనే స్విగ్గీ కూడా ప్లాట్ ఫారమ్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రతి ఆర్డర్‌పై కస్టమర్లు చెల్లించే అదనపు భారం ఇప్పుడు మరింత పెరగనుంది.

కస్టమర్లపై అదనపు భారమే..

స్విగ్గీ తన ప్లాట్‌ఫారమ్ ఫీజును రూ.14.99 నుంచి ఏకంగా రూ.17.58 (జీఎస్టీతో కలిపి) కి పెంచింది. ఇది దాదాపు 17 శాతం పెరుగుదల కావడం గమనార్హం. ప్లాట్‌ఫారమ్ నిర్వహణ, మెరుగైన సేవలను అందించేందుకే ఈ ఫీజును సవరించినట్లు సంస్థ తన యాప్‌లో కస్టమర్లకు సమాచారం ఇస్తోంది. మరోవైపు జొమాటో కూడా ఒక్కో ఆర్డర్‌పై జీఎస్టీ కాకుండా రూ.12.50 గా ఉన్న ప్లాట్‌ఫారమ్ ఫీజును రూ.14.90 కి పెంచింది. అంటే ఒక్కో ఆర్డర్‌పై సుమారు రూ.2.40 అదనంగా భారం పడనుంది.

పన్నులతో కలిపి చూస్తే ఈ రెండు పోటీ సంస్థలు ఇప్పుడు దాదాపు ఒకే విధమైన చార్జీలను వసూలు చేస్తున్నాయి. సాధారణంగా ప్లాట్‌ఫారమ్ ఫీజు అనేది చిన్న మొత్తంగా అనిపించినప్పటికీ, నెలకు పదుల సంఖ్యలో ఆర్డర్లు చేసే కస్టమర్ల బడ్జెట్‌పై ఇది గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. యాప్ సాంకేతికతను మెరుగుపరచడం, నిర్వహణ ఖర్చులు, కార్యకలాపాల వ్యయం పెరగడమే ఈ పెంపునకు కారణమని కంపెనీలు సమర్థించుకుంటున్నాయి.

అయితే.. ఈ ఫీజుల పెంపు సమయంలోనే ఫుడ్ డెలివరీ రంగంలోకి కొత్త పోటీదారులు ప్రవేశిస్తున్నారు. రైడ్-హేయింగ్ స్టార్టప్ రాపిడో ఇప్పటికే బెంగళూరులో 'ఓన్లీ' పేరుతో తన సేవలను ప్రారంభించింది. జొమాటో, స్విగ్గీలకు భిన్నంగా రాపిడో కస్టమర్ల నుంచి లేదా రెస్టారెంట్ల నుంచి అదనపు ప్లాట్‌ఫారమ్ ఫీజులు వసూలు చేయబోమని, కేవలం బేసిక్ డెలివరీ చార్జీలు మాత్రమే ఉంటాయని ప్రకటించడం విశేషం. కొత్తగా వస్తున్న ఈ సంస్థల ప్రభావం వల్ల భవిష్యత్తులో జొమాటో, స్విగ్గీలు తమ ధరల వ్యూహాలను మార్చుకుంటాయో లేదో వేచి చూడాలి.

# మత మార్పిడులపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

మొదటి పేజీ తరువాయి

క్రైస్తవ మతంలోకి మారిన పాస్టర్ ఎస్సీ ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని సుప్రీం న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ వారు సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు సుప్రీంకోర్టు మద్దతుగా నిలిచింది.

అసలు కేసు ఏంటీ అంటే..?: గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెంలో ఒక పాస్టర్‌పై జరిగిన దాడికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. దశాబ్ద కాలంగా పాస్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తి క్రైస్తవ మతాన్ని స్వీకరించినట్లు కోర్టు గుర్తించింది. క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు తావులేదని, కాబట్టి ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన తర్వాత అట్రాసిటీ చట్టం (ఎస్సీ/ఎస్టీ యాక్ట్) కింద ఫిర్యాదు చేసే హక్కు ఉండదని కోర్టు స్పష్టం చేసింది. దాడి జరిగిన సమయంలోనూ సదరు వ్యక్తి ప్రార్థనలు చేస్తున్నట్లు గుర్తించిన కోర్టు, ఈ వ్యాఖ్యలు చేసింది.

తహశీల్దార్ ఇచ్చిన ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ, మత మార్పిడి తర్వాత ఆ చట్టపరమైన రక్షణ పొందేందుకు సదరు వ్యక్తికి అర్హత ఉండదని కోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని 341 అధికరణ ప్రకారం, ఎస్సీ హోదా కేవలం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను అనుసరించే వారికి మాత్రమే పరిమితం చేయబడింది. మత మార్పిడి ద్వారా క్రైస్తవం, ఇస్లాం మతాన్ని స్వీకరించినప్పుడు సహజంగానే ఎస్సీ హోదా రద్దవుతుందని, తద్వారా అట్రాసిటీ చట్టం వర్తించదని హైకోర్టు ఈ కేసులో వ్యాఖ్యానించింది. ఈ తీర్పును సవాల్ చేసి సుప్రీంకి వెళ్లిన ఫాస్టర్ కు అక్కడ కూడా చేదు అనుభవం ఎదురైంది.

# విద్యార్థినులకు ఉచిత సైకిళ్లు.. మహిళలకు నెలకు రూ.2,500 భరోసా

**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా నేతృత్వంలోని ప్రభుత్వం అసెంబ్లీలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విప్లవాత్మకమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో విద్య, మహిళా సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. ముఖ్యంగా విద్యారంగానికి రికార్డు స్థాయిలో 19,148 కోట్లను కేటాయించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుమారు 1.30 లక్షల మంది విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా 90 కోట్లను కేటాయించారు. అంతేకాకుండా, నరేలా ప్రాంతంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 'ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ సిటీ'ని నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత కోసం ప్రభుత్వం భారీ పథకాలను ప్రకటించింది. 'మహిళా సమ్మాన్' పథకం కింద అర్హులైన మహిళా లబ్ధిదారులకు నెలకు 2,500 చొప్పున నేరుగా వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ పథకం కోసం బడ్జెట్‌లో 5,110 కోట్లను కేటాయించారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల సంక్షేమ పథకాల కోసం 227 కోట్లను కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలో స్టార్టప్ పాలసీని బలోపేతం చేయడం, వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా ఢిల్లీని ఆర్థికంగా మరింత ముందుకు తీసుకెళ్లడమే ఈ బడ్జెట్ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేఖా గుప్తా స్పష్టం చేశారు.

# విజయవాడ నగరంలో కలకలం.. ఉగ్రవాద సానుభూతిపరుల అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

ఉగ్రవాద గ్రూపులకు సానుభూతిపరులుగా వ్యవహరిస్తున్న ముగ్గురు యువకులు మహమ్మద్ రహమతుల్లా, డానిష్, సొహైల్ బేగ్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సోషల్ మీడియాలో తీవ్రవాదాన్ని ప్రోత్సహించేలా పోస్టులు పెడుతూ, యువతను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. విజయవాడ వెస్ట్ ఏసీపీ దుర్గారావు ఈ దాడులను ధ్రువీకరించారు. వించిపేటలో ఆకస్మిక దాడులు నిర్వహించి నిందితులను కస్టడీలోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. తాజా ఘటనతో నగర వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రస్తుతం అధికారులు నిందితుల మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని, వారికి ఎవరితోనైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో లోతుగా విచారణ జరుపుతున్నారు.

# జేడీయూ జాతీయ అధ్యక్షుడిగా నితీష్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** జనతాదళ్ (యునైటెడ్) జాతీయ అధ్యక్షుడిగా బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి నితీష్ కుమార్ తప్ప మరెవరూ బరిలో లేరు. దీంతో ఆయన ఎన్నిక ఖాయమైందని పార్టీ రిటర్నింగ్ అధికారి అనిల్ ప్రసాద్ హెగ్డే అధికారికంగా ప్రకటించారు. మధ్యాహ్నం 2:30 గంటలకు ఆయనకు ఎన్నిక ధృవీకరణ పత్రాన్ని అందజేయనున్నారు.

నితీష్ కుమార్ జాతీయ స్థాయిలో పార్టీని నడిపించడం ఇది వరుసగా నాలుగోసారి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కేంద్ర మంత్రి లలన్ సింగ్, బీహార్ మంత్రి శ్రవణ్ కుమార్ వంటి సీనియర్ నేతలు నితీష్ కుమార్ తరపున నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ కేడర్ అంతా నితీష్ నాయకత్వాన్నే కోరుకోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంజయ్ ఝా వెల్లడించారు. నితీష్ కుమార్ నాయకత్వంలో అటు పార్టీ బలోపేతం కావడమే కాకుండా, బీహార్ అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని పార్టీ నేత రామ్‌నాథ్ ఠాకూర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇటీవల రాజ్యసభ సీట్ల కేటాయింపు విషయంలో పార్టీ సీనియర్ నేత కేసీ త్యాగి అసంతృప్తితో ఉన్నారనే వార్తలు వచ్చాయి. అయితే, నితీష్ కుమార్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత విభేదాలు లేవని, తమ బంధం ఎప్పటిలాగే కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కేవలం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన లేదని, అంతకు మించి ఏమీ లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. నితీష్ కుమార్ ప్రస్తుతం ఢిల్లీలోనే ఉంటూ పార్టీ జాతీయ రాజకీయాలను పర్యవేక్షిస్తున్నట్లు పార్టీ నేతలు ప్రకటించారు.

# త్వరలో 'సాదాబైనామా' దరఖాస్తుల పరిష్కారం శాసనమండలిలో మంత్రి పొంగులేటి ప్రకటన

**న్యూస్ డెస్క్, 24 మార్చి (కెరటం న్యూస్):** రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలిలో సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. గత ప్రభుత్వం సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించినప్పటికీ, 2020 ఆర్.ఓ.ఆర్ చట్టంలో వాటి పరిష్కార మార్గాన్ని చూపలేదని విమర్శించారు.

జీవో 76తో ఊరట..సాదాబైనామా సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో.. కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధన వల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని, ఇకపై కేవలం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీవో 76 విడుదల చేసినట్లు తెలిపారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9 లక్షలకు పైగా దరఖాస్తుదారులకు లబ్ధి చేకూరనుంది.

ఆధార్ మాదిరిగానే 'భూధార్'..నక్షా (మ్యాప్) లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా రీ-సర్వే నిర్వహించామని మంత్రి తెలిపారు. ఇందులో ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే 'భూధార్' కేటాయించినట్లు వెల్లడించారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో, ఒక్కో జిల్లాలో 70 గ్రామాల చొప్పున భూ సర్వే నిర్వహించి, దశలవారీగా భూధార్ నెంబర్లు జారీ చేస్తామని, తద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు.

అవినీతిపై ఉక్కుపాదం..ధరణి పోర్టల్‌లోని లోపాలను ఆసరాగా చేసుకుని కొంతమంది మీ-సేవ నిర్వాహకులతో కలిసి రూ. 3.99 కోట్ల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపిస్తున్నామని మంత్రి తెలిపారు. తప్పు చేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని, ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో 'భూ భారతి' పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు.

# 35 ఏళ్ల అజ్ఞాతవాసానికి తెర మావోయిస్టు అగ్రనేత పాపారావు సరెండర్!

మొదటి పేజీ తరువాయి

బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల పట్టును కాపాడటంలో ఈయనదే ప్రధాన పాత్ర. ఇప్పటికే పలుమార్లు ఎన్‌కౌంటర్ల నుంచి తృటిలో తప్పించుకున్నారు.

ఒత్తిడితోనే సరెండర్ వైపు.. ఈ నెల 31కల్లా దేశంలో మావోయిస్టులను అంతమొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టి 'ఆపరేషన్ కగార్' తుది దశకు చేరిన వేళ గత వారం రోజులుగా దక్షిణ బస్తర్ ప్రాంతంలో భద్రతా బలగాలు ఇంటెలిజెన్స్ ఆధారిత ఆపరేషన్లను అత్యంత వేగంగా ముమ్మరం చేశాయి. అడవులను జల్లెడ పట్టడం, సమాచార వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో పాపారావు వ్యక్తిగత నెట్‌వర్క్ పూర్తిగా బలహీనపడినట్లుగా తెలుస్తోంది. దానికి తోడు అధికారుల నుంచి పెరిగిన ఒత్తిడి కారణంగా ఆయన అజ్ఞాతాన్ని వీడాలని నిర్ణయించుకున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఓ స్థానిక జర్నలిస్టు ద్వారా అధికారులను సంప్రదించి సరెండర్ ప్రక్రియను పూర్తి చేసినట్లుగా సమాచారం. కాగా, బస్తర్ ప్రాంతంలో చివరి అగ్రనేత పాపారావు లొంగిపోవడం వల్ల దక్షిణ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి నామమాత్రంగా మారే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# ఎస్‌బీఐ కస్టమర్లకు గుడ్‌న్యూస్: ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంపు!

మొదటి పేజీ తరువాయి

సాధారణ కస్టమర్ల కంటే సీనియర్ సిటిజన్లకు ఎప్పుడూ అదనపు వడ్డీ లభిస్తుంది. వీరి కోసం 180 రోజుల నుంచి ఏడాది లోపు డిపాజిట్లపై వడ్డీ రేటు 6.10 శాతం నుంచి 6.35 శాతానికి, ఏడాది నుంచి రెండేళ్ల డిపాజిట్లపై 6.75 శాతం నుంచి 7.00 శాతానికి పెరిగింది.

ఈ కొత్త వడ్డీ రేట్లు కొత్తగా చేసే డిపాజిట్లకు, మెచ్యూరిటీ తర్వాత రెన్యువల్ చేసే డిపాజిట్లకు మాత్రమే వర్తిస్తాయని ఈ సందర్భంగా ఎస్‌బీఐ స్పష్టం చేసింది. అయితే, బల్క్ టర్మ్ డిపాజిట్లను గడువు ముందే విత్‌డ్రా చేసుకుంటే 1 శాతం పెనాల్టీ యథాతథంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. చాలా బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గిస్తున్న తరుణంలో ఎస్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం పెద్ద మొత్తంలో డిపాజిట్ చేయాలనుకునే వారికి, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు మంచి లాభదాయకంగా మారనుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ట్రంప్ 'విరామ' వ్యూహం.. ఇరాన్ 'సవాల్' గర్జన ఆగని దాడులు ముగియని పోరు!

మొదటి పేజీ తరువాయి



తగ్గేదేలే అంటున్న ఇరాన్: అమెరికా ప్రకటనపై ఇరాన్ ఏమాత్రం మెత్తబడకపోగా, మరింత ఘాటుగా స్పందించింది. ట్రంప్ చేస్తున్నది 'అబద్ధపు ప్రచారం' అని, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల దాడికి భయపడే అమెరికా వెనక్కి తగ్గిందని ఇరాన్ మీడియా ప్రచారం చేస్తోంది. "అమెరికాతో ఎటువంటి శాంతి చర్చలు జరపడం లేదు.. ట్రంప్ ఆడుతున్న ఈ నాటకాలను నమ్మం" అని ఇరాన్ స్పష్టం చేసింది. ట్రంప్ ప్రకటనను తమ దేశ విజయంగా అభివర్ణిస్తూ, ఇరాన్ సైన్యం క్షిపణి దాడులను మరింత ఉధృతం చేసింది. దీంతో గల్ఫ్ రీజియన్‌లో శాంతి మాట అటుంచి, యుద్ధం ఏ క్షణంలోనైనా తదుపరి స్థాయికి చేరుకునే ప్రమాదం కనిపిస్తోందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# సీతారామ ప్రాజెక్టుకు బడ్జెట్లో కేటాయింపులు పెంచాలి

## రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాల భూమి కి సాగు నీరు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయింపులు పెంచాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం మంచి కంటి హాల్ లో తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు కేటాయించాలి అని, వ్యవసాయ రంగం కు నిధులు కోత సవరించాలి, విద్యా, వైద్య రంగాలకు మరియు సంక్షేమ పథకాలకు నిధులు కేటాయింపులు పెంచాలి అని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశం కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం కు శాసనసభ లో ప్రవేశ పెట్టిన బడ్జెట్లో అంకెలు సంఖ్యలు పెరుగుదల తప్ప వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేదని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ఏడు లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందించే సామర్థ్యం ఉన్న సీతారామ ప్రాజెక్టు కు నిధులు కేటాయింపులు తక్కువ చేయుడం పై ముగ్గురు మంత్రులు భాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.గోదావరి నది పై సీతమ్మ బ్యారేజి నిర్మాణం పూర్తి చేయకుండా సాగు నీరు 2026 ఆగస్టు 15 నాటికి అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైరా రైతు సభలో ప్రకటించారు అని గుర్తు చేశారు. కేసిఆర్ ప్రభుత్వం పూర్తి చేసిన పనులు ఆధారంగా నీరు కొని ప్రాంతాలకు అందించే ప్రయత్నం తప్ప, పాలేరు రిజర్వాయర్ కు అనుసంధానం చేసే పనులు పూర్తి చేయడం లేదని అన్నారు, సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వం కు రెండు కండ్లు అని చెప్పిన ఆచరణ లో విద్యా, వైద్య రంగాలకు నిధులు కేటాయింపులు తక్కువ చేశారు అని అన్నారు, ఆక్స్ఫర్డ్, క్రేంబిడ్జి స్థాయిలో తెలంగాణ విద్యార్థులకు విద్యా అందించాలంటే ప్రభుత్వ విద్యా సంస్థలు అన్నింటిలో అత్యంత నాణ్యమైన వసతులు, సౌకర్యాలు కల్పించడం తోపాటు విద్యా లో ఉన్న అంతరాలను రూపు మా పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన 9000 కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయింపులు చేయకుండా ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా మూడు వందల ముప్పై ఆరు కోట్ల రూపాయలు కేటాయించడం సవతి తల్లి ప్రేమ కు నిదర్శనం అన్నారు. ఇందిరమ్మ భీమా పథకం కుటుంబ సభ్యులు అందరికీ వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు, ఇండ్ల స్థలాలు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అందుకు అవసరమైన నిధులు బడ్జెట్ లో కేటాయించాలని కోరారు. లోపభూయిష్టంగా ఉన్న విద్యా విధానం మూలంగా



విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విద్యా విధానాన్ని అన్ని స్థాయిల్లో సంస్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ, ఎస్ కె మీరా వాసిరెడ్డి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రా శ్రీనివాసరావు, వత్సవాయి జానికిరాములు, కొండె బోయిన నాగేశ్వరరావు, తాళ్ళపల్లి కృష్ణ, నంద్ర ప్రసాద్, తన్నీరు కృష్ణార్జున రావు, పాపినేని రాంనర్సయ్య, కెవి రెడ్డి, కె విపిఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, సిఐటియు జిల్లా నాయకులు ఎస్ కె బషీర్, కె నరెంద్ర, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, రిటైర్డ్ ఉద్యోగులు సంఘం నాయకులు కళ్యాణం నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వరరావు, కుసుపూడి మధు, వడ్లమూడి నాగేశ్వరరావు, వెంకన్న, షరిఫ్, జ్యోతి బసు తదితరులు పాల్గొన్నారు.

# పాపగంటి గురవయ్య మృతికి

## రైతు సంఘం సంతాపం



**కొణిజర్ల, కెరటం న్యూస్ ప్రతినిధి:** కొనిజర్ల మండలం చిన్న మొనగాల గ్రామ సిపిఐ సీనియర్ పాపగంటి గురవయ్య మృతి చెందినారు వారి మరణ వార్త తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు మాజీ జెడ్పిటిసి సభ్యులు దొండపాటి రమేష్ పాపగంటి గురవయ్య మృతి,దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు వీరు వీరు,తో పాటు రైతు సంఘం నాయకులు పాపగంటి సుదర్శన్ ,సొంసన్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేడు పెన్షనర్ల బ్లాక్ డే

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా మార్చి 25న పెన్షన్ వాలిడేషన్ యాక్ట్ 2025 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పెన్షనర్లు బ్లాక్ డే పాటిస్తూ పెన్షనర్లను వివిధ రకాలుగా విభజించవద్దని గత సంవత్సరం మార్చి 25న పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని రద్దు పరచాలని మండల తహసీల్దారుల ద్వారా ప్రధానమంత్రి గారికి విజ్ఞాపన పత్రాలని ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎం సుబ్బయ్య టి వేణు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టి కలెక్టర్ ద్వారా ప్రధానమంత్రి కి వినతి పత్రాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పెన్షనర్లు అందరూ ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# వంట గ్యాస్ కొరత కేంద్రానికి పట్టదా?

## ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



**హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్:** రాష్ట్రంలో నెలకొన్న తీవ్రమైన గ్యాస్ సిలిండర్ల కొరతను నిరసిస్తూ, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు మరియు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నేడు అసెంబ్లీ ముందరి గన్ పార్క్ వద్ద నిరసన చేపట్టారు. చేతిలో గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులు పట్టుకుని, ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా పార్టీ శ్రేణులతో కలిసి ఆయన నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ, "రాష్ట్రంలో గ్యాస్ కొరత వేధిస్తుంటే, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏమాత్రం సఖ్యత లేదని మండిపడ్డారు. కేంద్రం గ్యాస్ పంపడం లేదని రాష్ట్రం, రాష్ట్రమే సరిగ్గా పంపిణీ చేయలేకపోతోందని కేంద్రం ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, కృత్రిమ కొరతను సృష్టిస్తూ సామాన్య గృహిణులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కేంద్రంతో మాట్లాడి గ్యాస్ నిల్వలను తెప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని, కేవలం ప్రకటనలకే పరిమితమవుతూ ప్రజలను వంచిస్తోందని ధ్వజమెత్తారు. గ్యాస్ దొరక్క హోటళ్లు, చిన్న వ్యాపారులు మూతపడే స్థితికి వచ్చారని, గృహ వినియోగ దారులు నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుంటే సామాన్యుడు బలిపశువు అవుతున్నాడని అన్నారు". ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# ఎస్సీ అభివృద్ధి నిధులు పూర్తి స్థాయిలో వినియోగించాలి

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ప్రణాళిక ప్రకారం ఎస్సీ అభివృద్ధి నిధులు పూర్తి స్థాయిలో వినియోగించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, వివిధ శాఖలలో ఎస్సీ అభివృద్ధి ఫండ్ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ శాఖ, హార్టికల్చర్, మహిళా శిశు సంక్షేమ శాఖ, రోడ్లు భవనాల శాఖ, ప్లానింగ్, మిషన్ భగీరథ, ఎన్పీడీసీఎల్, ఎస్సీ అభివృద్ధి శాఖ, మొదలగు వివిధ శాఖల పరిధిలో ఎస్సీ అభివృద్ధి ఫండ్ నిధుల వినియోగంపై చర్చించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎస్సీ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి శాఖ పరిధిలో షెడ్యూల్ కులాల లబ్ధిదారు లకు ప్రాధాన్యత ఇవ్వడం కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో సాగు ఆధునీకరణ, ఇతర అభివృద్ధి పథకాలు ఎస్సీ రైతులకు అమలు చేయడంలో కొంత వెనుకబడి ఉన్నామని, రాబోయే సంవత్సరంలో మరింత మెరుగ్గా ప్రణాళిక సిద్ధం చేసుకుని వచ్చిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హార్టికల్చర్ విభాగంలో ఆయిల్ పామ్, మైక్రో ఇరిగేషన్ పథకాలలో ఎస్సీలకు కేటాయించిన లబ్ధిదారులు 20 శాతం కూడా చేరుకోకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఆరోగ్య లక్ష్మీ స్కీంను మరింత మెరుగ్గా అమలు చేసి పూర్తి స్థాయిలో నిధులు వినియోగించాలని అన్నారు. ప్రతి శాఖకు విడుదల చేసే నిధులలో ఎస్సి లకు, ఎస్టీలకు తప్పనిసరిగా ఖర్చు చేయాలని అన్నారు. ఎస్సి అభివృద్ధి నిధుల వినియోగంపై రిపోర్ట్ పకడ్బందీగా తయారు చేసి పంపాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, ఈడీ ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, సిపిఓ ఏ. శ్రీనివాస్, డిడబ్ల్యూఓ



వేల్పుల విజేత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డిఆర్డీవో కె. శ్రీరామ్, పిడి హౌసింగ్ బి. శ్రీనివాస్, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, పోలీస్, విద్యుత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను భారాలు తగ్గించకపోతే ఆందోళన తీవ్రతరం

## నున్నా నాగేశ్వరరావు



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** ఖమ్మం నగర ప్రజలపై వేస్తున్న ఇంటి పన్ను ఆర్థిక భారాలను వెంటనే తగ్గించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ముందు మంగళవారం భారీ ధర్నా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దొంగల తిరుపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ అనంత్ ప్రయివేటు లిమిటెడ్ అనే సంస్థకు ఆస్తి పన్నులు వేసే అధికారం కట్టబెట్టడం వెనుక మతలబు ఏమిటో ఖమ్మం నగర ప్రజలకు కమిషనర్, మేయర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో వేస్తున్న ఆస్తి పన్నులపై అనేక అవకతవకలు జరిగే అవకాశం ఉంది అని వెంటనే గత పాలసీ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఇంటి పన్నులపై పాత జిఓ ఉత్తర్వులను పక్కన బెట్టి మరీ క్రమబద్ధీకరణ పేరుతో ఎడాపెడా నగర ప్రజలపై ఇంటి పన్నులు వేసి వసూలు చేస్తున్నారు అని ఆరోపించారు. ప్రస్తుతం వస్తున్న ఇంటి టాక్స్ బిల్లులు చూసి సామాన్య, మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. పన్నులు వేసే విధానాన్ని పలు సర్కిల్ గా విభజన చేసి మరీ టాక్స్ లు వేయడం అనాలోచిత నిర్ణయం అని దుయ్యబట్టారు. పన్నులపై వడ్డీ పేరుతో మరింతగా అపరాధ రుసుం వేయడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు పైగా ఈ సంవత్సరం ఏప్రిల్ ఫస్ట్ నుంచి మరింత ఇంటి పన్నులు పెరుగుతాయి అని మీడియా వస్తున్న వార్తలపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు ఆమోదం తెలిపి క్రమక్రమంగా ప్రజలపై వివిధ రూపాల్లో ఆర్థిక భారాలు వేసే పనిలో పడింది అని ఆరోపించారు. చెత్త పన్ను, నీళ్ళ పన్ను, ఇంటి పన్ను ఇలా భారాలు వేయడం ప్రయివేటీకరణ లో భాగమే అని విమర్శించారు. తక్షణమే ఖమ్మం కార్పొరేషన్ అధికారులు, కమీషన్, మేయర్, మంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకొని నగర ప్రజలకు ఇంటి పన్నుల భారాలు నుంచి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో ఈ సమస్యపై ప్రభుత్యం స్పందించకపోతే నగర ప్రజలను సమీకరించి ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ కె శ్రీనివాసురావు,



అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్ ధర్నా వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. వారు మాట్లాడుతూ పై అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి సమస్య పరిష్కారం కోసం తమ ప్రయత్నం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, టి విష్ణు, ఎంఏ జబ్బర్, భుక్యా శ్రీనువాసురావు, ఎస్కె. మీరా సాహిబ్, ఎస్ నవీన్ రెడ్డి, పి రమ్య ,ఎస్కె. నాగులు మీరా , బోడపట్ల సుదర్శన్, ఉపేంద్ర, వజేనేపల్లి శ్రీనువాసురావు, పి నాగసులోచన, కార్పొరేటర్లు యర్రా గోపి, ఎల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# సేవే మార్గం - ప్రజాక్షేమమే లక్ష్యం!



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** ఖమ్మం 48వ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్, పద్మావతి నగర్ మరియు సారధి నగర్ ప్రాంతాల్లో ఖాళీ ప్లాట్లు పిచ్చి మొక్కలతో నిండి, పాములకు నిలయంగా మారడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన ప్రజలు వెంటనే కాంగ్రెస్ నాయకులు అల్లే సాయికిరణ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల విన్నపాన్ని మన్నించి, మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మరియు తుమ్మల యుగేందర్ సూచనలతో, సాయికిరణ్ వెంటనే స్పందించారు. తన సొంత ఖర్చుతో జెసిబిలను తెప్పించి, గత రెండు రోజులుగా యుద్ధప్రాతిపదికన ప్రతి ప్లాట్‌ను, ఎక్కడ చెత్తాచెదారం ఉన్నా పూర్తిగా శుభ్రం చేయించారు. ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి, వెంటనే సమస్యను పరిష్కరించిన సాయికిరణ్ చొరవపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న సాయికిరణ్ సేవలు అభినందనీయమని ప్రజా సేవలో నిరంతరం ఉండే అల్లే సాయికిరణ్ కు 48వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, సారధి నగర్ ప్రజలు అభినందనలు తెలిపారు.

# టీబీ రహిత జిల్లా సాధన లక్ష్యంగా చర్యలు

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి






**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** టీబీ రహిత జిల్లాగా ఖమ్మంను తయారు చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా స్థానిక బాలాజీ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 100 రోజుల వ్యవధిలో హై రిస్క్ ఉన్న 94 గ్రామాలలో టీబీ స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టి అనుమానితులను గుర్తించి అవసరమైన వైద్య పరీక్షల ద్వారా టీబీ వ్యాధి నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. టీబీ వ్యాధి నిర్ధారణ జరిగిన ప్రతి ఒక్కరికి వెంటనే చికిత్స ప్రారంభిస్తామని తెలిపారు. టీబీ ని గుర్తించి, చికిత్స అందించాలని అన్నారు. జాతీయ టీబీ కార్యక్రమం క్రింద గతంలో అనేక స్క్రీనింగ్ కార్యక్రమాలను జిల్లాలో అమలు చేశామని అన్నారు. ప్రస్తుతం జరిగే స్క్రీనింగ్ మరింత మెరుగ్గా జరగాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఈ స్క్రీనింగ్ కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ, కార్పొరేషన్, పంచాయతీ పాలక వర్గాలు భాగస్వామ్యం కావాలని అన్నారు. పోలియో తరహాలో టీబీ స్క్రీనింగ్ కార్యక్రమం విస్తృతంగా జరగాలని అన్నారు. 94 గ్రామాలలో 14 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి టీబీ స్క్రీనింగ్ నిర్వహించాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో వచ్చే టీబీ కేసులను ఏఐ ద్వారా విశ్లేషించి 94 హైరిస్క్ గ్రామాలను ఎంపిక చేసుకోవడం జరిగిందని అన్నారు. ఈ గ్రామాలలో స్క్రీనింగ్ విజయవంతం చేయడం ద్వారా టీబీని నిరోధించవచ్చని అన్నారు. టీబీ రహిత ఖమ్మం జిల్లా సాధన లక్ష్యంగా మనమంతా కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. టీబీ స్క్రీనింగ్ కార్యక్రమం ఇంటింటికీ చేయాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ స్క్రీనింగ్ పర్యవేక్షణకు నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. టీబీ వ్యాధిపట్ల ఎటువంటి భయాందోళనలు ఉండాల్సిన అవసరం లేదని, దీనిని మనం నివారించవచ్చని, వ్యాధి వ్యాప్తి చెందినప్పటికి సరైన చికిత్సతో నయం చేసుకోవచ్చని అన్నారు. టీబీ వ్యాధి వ్యాప్తి చెందితే వెంటనే చికిత్స అందించాలని, బయటకు చెప్పకుండా ఆలస్యం చేస్తే పరిస్థితి ఆందోళనకర పరిస్థితికి చేరుకుంటుందని అన్నారు. పోలియో తరహాలో టీబీ ని దేశం నుంచి తరిమికొట్టాలని అన్నారు. టీబి నిరోధకంలో ఖమ్మం జిల్లాను ప్రథమ స్థాయిలో ఉంచిన వైద్యారోగ్య శాఖ సిబ్బందికి కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ టీబీ వ్యాధికి ప్రస్తుతం భయపడాల్సిన అవసరం లేదని, టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. టిబి చికిత్సకు సంబంధించిన మందులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, వైద్యుల సూచనల మేరకు మందుల కోర్సు పూర్తి స్థాయిలో తప్పనిసరిగా వాడాలని అన్నారు. టీబీ రహితంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకున్నారని, దీని సాధన కోసం అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, వైద్యులు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డ్రగ్స్ అసోసియేషన్ వారు అందించిన నిక్షయ మిత్ర న్యూట్రీషన్ కిట్లను రోగులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రామారావు, ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వేణుమాధవ్, జిల్లా టిబి నియంత్రణ అధికారి డా. సుబ్బారావు, వైద్యాధికారులు , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# సాదాబైనామ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రక్రియ ను వేగవంతం చేయాలి

**టౌన్ ఏరియాల్లో ఈ స్కీం అమలు చేయాలి**

**ల్యాండ్ సర్వేయార్ల సమస్య తీర్చండి**

**ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి**



**పటాన్ చెరు, 24 మార్చి (కెరటం న్యూస్):** సాదాబైనామ కింద దరఖాస్తు చేసుకున్న భూముల వెంటనే క్రమబద్ధీకరణ ప్రక్రియ ను వేగవంతం చేయాలనీ ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం శాసన మండలి లో క్వశ్చన్ ఓవర్ లో అంజిరెడ్డి మాట్లాడారు. ఏండ్ల నుంచి సాదా కాగితం ఆధారంగా భూములు కొనుగోలు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ‘ రికార్డులో భూములు ఎక్కలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే క్రమబద్ధీకరణ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు అతి గతి లేదు. విచారణ పేరుతో ఎమ్మార్వో ఆర్డీవో లాగిన్ లో దరఖాస్తులను రిజెక్ట్ చేస్తున్నారు. ల్యాండ్ సర్వేల సమస్య తీవ్రంగా ఉంది. ప్రభుత్వం కొత్తగా ల్యాండ్ సర్వేలను తీసుకున్నప్పటికీ ఇప్పటికీ ఫీల్డ్ లోకి వెళ్లడం లేదు. ఈ సమస్యతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. 12-10-2020 నుంచి 10-11-2020 మధ్యకాలంలో దరఖాస్తు చేసుకున్న సాదాబైనామ భూములను క్రమబద్ధీకరించాలని,26-08-2025న రాష్ట్ర హై కోర్ట్ ఇచ్చిన ఆదేశాలమేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన ఆశించి మేర ప్రయోజనం లేదు. ఈ పథకం కింద, గరిష్టంగా 5 ఎకరాల వరకు కేవలం కాగితాలపై నమోదైన భూములను క్రమబద్ధీకరించాలని ఉంది. ఈ విస్తీర్ణం పెంచాలి.ప్రభుత్వ ప్రకారం నోటిఫికేషన్ ప్రకారం 2 జూన్ 2014కు ముందు జరిగిన సాదాబైనామ లావాదేవీలు ఈ క్రమబద్ధీకరణకు వీలవుతుంది. ఈ పథకం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎచ్ఎండీఏ), కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలలోని భూములకు వర్తించాలి. ప్రభుత్వం వెంటనే రైతులకు భూమి యాజమాన్య హక్కులను చట్టబద్ధం చేయడం, పట్టాదార్ పాస్‌బుక్‌లు జారీ చేయడం పాటు ఈ పథకం గ్రామీణ రైతులకు తమ భూములను చట్టబద్ధం చేసుకునే అవకాశం వస్తుంది. తద్వారా వారు రైత్వారీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను భూ యజమానులు పొందవచ్చు. వెంటనే ఈ ప్రక్రియ ను

# దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

## బొమ్మెర రామమూర్తి తీవ్ర విమర్శలు



ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్: దళిత క్రైస్తవుల అంశంపై వెలువడిన తాజా సుప్రీంకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,మధిర నియోజకవర్గ మాజీ ఇంచ్చార్జీ బొమ్మెర రామమూర్తి తీవ్రంగా స్పందించారు.ఈ తీర్పు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, ముఖ్యంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 మరియు ఆర్టికల్ 25లను నేరుగా ఉల్లంఘిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మిడియా వేదికగా వెల్లడిస్తూ కేంద్ర ప్రభుత్వంపై కూడా గట్టి విమర్శలు చేశారు. ఆర్టికల్ 15 ప్రకారం మతం, కులం ఆధారంగా వివక్ష చూపరాదని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది. అలాగే ఆర్టికల్ 25 ప్రతి పౌరుడికి తనకు నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను హామీ ఇస్తుంది. ఈ నేపథ్యంలో, ఒక వ్యక్తి మత మార్పిడి చేసుకున్న కారణంగా అతనికి లభించే సామాజిక రక్షణలను తొలగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని బొమ్మెర రామమూర్తి అభిప్రాయపడ్డారు. మత స్వేచ్ఛను కుల హక్కులతో అనుసంధానం చేయడం సరైన పద్ధతి కాదని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఈ తీర్పుపై పునర్విచారణ కోరుతూ సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అణగారిన వర్గాల హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, ఈ విషయంలో కేంద్రం మౌనం వహించకూడదని ఆయన పేర్కొన్నారు. క్రైస్తవం, ఇస్లాం లేదా బౌద్ధం వంటి మతాలకు మారినప్పటికీ, షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తులు సామాజికంగా ఎదుర్కొనే వివక్ష పూర్తిగా తగ్గిపోలేదని ఆయన గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కారంచేడు, చుండూరు ఘటనలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, మత మార్పిడి జరిగినా కుల ఆధారిత హింస ఇంకా కొనసాగుతూనే ఉందని తెలిపారు. ఇది దేశంలో ఉన్న కఠిన సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ తీర్పు వల్ల క్రైస్తవం లేదా ఇస్లాం మతాలను అనుసరించే లక్షలాది అణగారిన పౌరులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎస్‌సి/ఎస్‌టి అట్రాసిటీస్ చట్టం కింద లభించే రక్షణలు వారికి అందకపోవడం, వారి భద్రతపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇక ఈ సమస్యపై సమగ్ర అధ్యయనం చేయడానికి ఏర్పాటు చేసిన జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ కమిటీ నివేదిక ఇంకా వెలువడకపోవడం కూడా ఆయన విమర్శించారు. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందని, ఇది ఒక పెద్ద స్థాయి కుట్రగా భావించాల్సిన అవసరం ఉందని ఆరోపించారు. ఈ తీర్పు మత స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ విలువలపై ప్రభావం చూపే అంశంగా మారిందని బొమ్మెర రామమూర్తి అభిప్రాయపడ్డారు. అణగారిన వర్గాల హక్కులను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే న్యాయపరమైన మార్గాల్లో ఈ తీర్పును సవాలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# అంబేద్కర్ యూత్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ విడుదల



**వనపర్తి, 24 మార్చి (కెరటం న్యూస్):** పెద్దమందడి మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ (పాంప్లెట్) ను గ్రామ ప్రజా ప్రతినిధులు మరియు యువజన సంఘాల సభ్యులు ఘనంగా విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు మరియు సభ్యులు గ్రామ సర్పంచ్ సూర్య గంగమ్మ రవి, ఉపసర్పంచ్ భోయిని ఉష, మాజీ జెడ్పిటిసి కొమ్ము వెంకటస్వామి, వార్డు మెంబర్లుకొమ్ము విష్ణు,కొమ్ము,, సత్యనారాయణ, అంబేద్కర్ యూత్ సభ్యులు సింగిరెడ్డి ఆంజనేయులు,కె. నాగరాజ్,డీలర్ ఎస్. కృష్ణ,కె.శివకృష్ణ,ఆర్. నాగరాజు,జి. ఆంజనేయులు,కె. రాజశేఖర్,శరత్, అజయ్,శివ,గణేష్, భీమరాజ్ తదితరులు. పాల్గొనారు.అంబేద్కర్ ఆశయాలను స్మరిస్తూ యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఈ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

# అశోక్ నాయక్ తండ్రిని పరామర్శించిన తుంబూరు దయాకర్ రెడ్డి



**ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మీర అశోక్ నాయక్ తండ్రిని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లో వెన్నుపూస శస్త్రచికిత్స చేయించుకుని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్మీర కిషోర్ నాయక్, కౌన్సిలర్ కడవ నవీన్ కుమార్, ధరావత్ నారాయణ, భూక్యా సర్వర్ సింగ్, పసుపులేటి సత్యం, సప్పిడి రాధాకృష్ణ, పుల్లారావు, వెలుగు సుధాకర్, పోతుల కృష్ణ, బానోత్ శంకర్, బానోత్ సాయి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.


# డ్రంక్ అండ్ డ్రైవ్ లో మద్యం తాగిన వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష-ఎస్ ఐ జలంధర్ రెడ్డి




**వనపర్తి, 24 మార్చి (కెరటం న్యూస్):** పెద్దమందడి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో, సోమవారం రాత్రి సమయంలో డ్రింక్ అండ్ డ్రైవ్ తనిఖీలో భాగంగా,పెద్దమందడి మండల కేంద్రంలో చెందిన నాగరాజు కు బ్రీతింగ్ తో పరీక్షించగా మద్యం తాగి వాహనం నడుపుతున్నడని రుజువైంది.ఇట్టి వ్యక్తిని కోర్టు లో హాజరు పరచగా,న్యాయమూర్తి రెండు రోజులు జైలు శిక్ష ఖరాబ్ చేసిందని పెద్దమందడి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.జలంధర్ రెడ్డి అన్నారు.

# బరితెగించిన ఇసుక మాఫీయా..!

- పోలీసు వాహనాన్ని ఢీ కొట్టిన అక్రమార్కులు
- పెట్రోలింగ్ విధుల్లో ఎస్ఐ, సిబ్బందిపై దూసుకెళ్లిన వైనం
- బషీరాబాద్ మండలంలో ఘటన






**వికారాబాద్ , 24 మార్చి (కెరటం న్యూస్):** తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలంలో ఇసుక మాఫీయా బరితెగింది. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఎస్ఐ, సిబ్బందిపై ట్రాక్టర్లతో దూసుకవచ్చి పోలీసు వాహనాన్ని ఢీ కొట్టారు. ఈ సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బషీరాబాద్ ఎస్ఐ శ్రీశైలం యాదవ్, సిబ్బందితో కలిసి పెట్రొలింగ్ నిర్వహిస్తున్నారు. మండలంలోని కోర్విచేడ్ గేటు వద్ద బషీరాబాద్ వస్తుండగా దామర్‌చేడ్ సురేష్, నంద్యానాయక్ శ్రీనివాస్‌లకు చెందిన ట్రాక్టర్లు నవల్గా వైపు వెళుతూ కనిపించారు. పోలీసులు పట్టుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో సురేష్, శ్రీనివాస్‌లు ట్రాక్టర్లతో పోలీసు వాహనాన్ని ఢీ కొట్టారు. దీంతో పోలీసు వాహనాన్ని బలమైన దెబ్బ తగిలింది. వెంటనే ఇసుక అక్రమార్కులు సురేష్, శ్రీనివాస్‌లు పరారయ్యారు. పోలీసులు నిందితుల నివాసాలకు వెళ్లి విచారింగా అచూకీ లభించలేదు. నిందితులను ఎలాగైనా పట్టుకుని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు. మరోవైపు మండలంలో రెచ్చిపోతున్న ఇసుక మాఫీయాపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోలీసు విధుల్లో ఉన్న కానిస్టేబుల్ కాళ్లపై నుంచి ట్రాక్టర్ ఎక్కించారని, తాజాగా పోలీసు వాహనాన్ని ఢీ కొట్టడం చర్చనీయాంశంగా మారింది.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారిలో పది మందికి ఒక రోజు కమ్యూనిటీ సర్వీస్ పనిష్మెంట్,జరిమానా

**ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు తనిఖీలు**

**పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం**




**సూర్యాపేట, 24 మార్చి (కెరటం న్యూస్):** మద్యం సేవించి వాహనాలు నడిపిన,పది మందికి ఒక రోజు కమ్యూనిటీ సర్వీస్ పనిష్మెంట్ మరియు జరిమానా. సూర్యాపేట కోర్టు విధించినట్లు, సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్సై సాయిరాం తెలిపారు. సూర్యాపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,పరిధిలోనీ పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన,పది మందిని కోర్టులో హాజరుపర్చగా. పది మందికి ఒక రోజు కమ్యూనిటీ సర్వీస్, పనిష్మెంట్ మరియు అందరికి కలిపి రూ.15,000/- జరిమానా విధిస్తూ, ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ గోపు రజిత తీర్పు వెల్లడించినట్లు, ఎస్సై తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ ఆదేశాల,మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు, ఎస్సై తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే, జరిమానాతో పాటు, జైలుకు వెళ్లాల్సి ఉంటుందని,ఈ సందర్భంగా హెచ్చరించారు.పోలీసులు చేసే వాహన తనిఖీలు ప్రజల, ప్రాణరక్షణ కోసమే అని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.